
24 నామినేషన్ల తిరస్కరణ

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో 115 పురుష, ఆరుగురు మహిళా అభ్యర్థులనుంచి మొత్తం 121 నామినేషన్లు దాఖలయ్యాయి. శిగ్గావి నుంచి 46, సండూరు నుంచి 13, చన్నపట్టణ నుంచి 62 వరకు మొత్తం 121 నామినేషన్లు వచ్చాయి. సోమవారం నామినేషన్ల స్ర్కూటినీ ప్రక్రియ జరిగింది. చన్నపట్టణ నుంచి 17, శిగ్గావి నుంచి 7 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు ఎన్నికల అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.





కాలుష్యానికి చెక్..!

- సముద్రంలోకి ప్లాస్టిక్ చేరకుండా 'కే-శోర్'
- వనరుల రక్షణకు నిఘా
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకం

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ మహమ్మారితో మనిషి మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. ప్లాస్టిక్ నియంత్రణకు గ్రామపంచాయతీల నుంచి స్థానిక సంస్థలతోపాటు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తలు నిరంతరంగా చైతన్యం కలిగిస్తున్నా పూర్తిగా నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయడం ద్వారా ఎన్నో క్రిమికీటకాలతోపాటు పశుసంపదకు నష్టం వాటిల్లుతోంది. రాష్ట్రంలో సుదీర్ఘమైన సముద్రతీరం ఉండడం, పలు ప్రాంతాలలో బీచ్‌లు, ఆలయాలు, ఓడరేవులు, నౌకాయానం వంటివి ఉన్నాయి. 320 కిలోమీటర్ల సముద్రతీరంలో దాదాపు 30-40కుపైగా ప్రాంతాలలో బీచ్‌లలో గడిపేందుకు స్థానికులతోపాటు దేశ విదేశీయులు వస్తుంటారు. సముద్రతీరంలో గడిపేందుకు గోవాకు వచ్చే దేశ విదేశీయులు అక్కడ రద్దీగా ఉంటుందని, కర్ణాటక బీచ్‌లకు వస్తుంటారు. ఇలా ప్రజలు సముద్రపు ఒడ్డున సరదాగా గడిపేందుకు వస్తున్న తరుణంలోనే ప్లాస్టిక్ వాడకం పెరుగుతోంది. అలల ద్వారా ప్లాస్టిక్‌వ్యర్థాలు సముద్రంలోకి వెళ్లడం ద్వారా జలచరాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి వెళ్లకుండా కట్టడి చేసేందుకు ప్రపంచబ్యాంకు సాయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కే శోర్ వినూత్న పథకాన్ని రూపొందించారు. ఇందుకు కర్ణాటక తీరప్రాంతాన్ని ఎంపిక చేశారు. దేశంలోని సముద్రతీర ప్రాంతాన్ని కేంద్రీకరించుకుని సముద్ర వనరులను, సుస్థిరంతో పాటు మనుగడకు ఈ పథకాన్ని అమలు చేయదలిచారు.

కే శోర్ అమలుకు ప్రత్యేక కమిటీ

కే శోర్ పథకం అమలుతోపాటు నిరంతర పర్యవేక్షణకు జిల్లా అధికారులు, అటవీ సంరక్షణాధికారి, జిల్లా పంచాయతీ సీఈఓ, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్‌లతో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఐదేళ్లపాటు ఈ ప్రాజెక్టు అమలులో ఉంటుంది. కాలానుగుణంగా కమిటీ సభలు జరిపి ప్రాజెక్టు అమలుపై మార్గదర్శకాలు చేస్తుంది. ఇదే విషయమై మంగళూరు సబ్‌డివిజన్ అటవీ సంరక్షణాధికారి ఆంటోని మరియప్ప తెలిపిన మేరకు ప్లాస్టిక్ పర్యావరణానికి మహమ్మారిగా మారుతోందని ఇది సముద్రంలోని సహజవనరులు, సరీశృపాలు, సముద్రసంపద ఉనికికి ప్రమాదం కలిగించనుందన్నారు. కే శోర్ మన రాష్ట్రతీరంలో అమలు చేసేందుకు దక్కిన మహత్తరమైన అవకాశమన్నారు.

840 కోట్లతో డీపీఆర్

రాష్ట్రంలో దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి జిల్లాల పరిధిలో 320 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. ఈ ప్రాజెక్టుకు రూ.840 కోట్లు డీపీఆర్ సిద్ధం చేశారు. ఇది ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించే ప్రాజెక్టు. నదులు ఉద్భవించే స్థలం నుంచి సముద్రతీరం చేరేదాకా, సుదీర్ఘమైన సముద్రతీరంలో ప్రాజెక్టు అమలులోకి రానుంది. ఇందుకు అటవీశాఖ, గ్రామీణ, నగరాభివృద్ధిశాఖ, మత్స్యశాఖలతో అనుసంధానం చేశారు. అటవీశాఖ పరిధిలో సముద్రతీరం ఉంటే చెట్లు పెంచడం, జీవవైవిధ్యత, సంరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాలు తీరంలోకి వెళ్లకుండా నియంత్రించడం వంటివి ఉన్నాయి. ఇక గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్‌ను నిషేధించడం, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఎంఆర్‌ఎఫ్ కేంద్రాలు, ప్లాస్టిక్‌ను మళ్లీ ఉపయోగించే విధానంపై చైతన్యం కలిగించడం వంటివి ఉన్నాయి. ఇక మత్స్యశాఖ ద్వారా చైతన్యం కలిగించి సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించడం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయమైన వ్యవస్థ కల్పించడం, నగరాభివృద్ధిశాఖ ద్వారా సంబంధించి నగరాలలో ప్లాస్టిక్ విభజించడం, ప్లాస్టిక్‌పై చైతన్యం, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై నిరంతరం పర్యవేక్షించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.



బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు

- మహానగర పాలికెగా హాసన్ నగరసభ అప్‌గ్రేడ్
- కేబినెట్‌లో కీలక నిర్ణయాలు

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబరు రెండు లేదా మూడోవారంలో బెళగావిలో నిర్వహించనున్నట్టు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన కేబినెట్ భేటీ నిర్ణయాలను మంత్రి మీడియాకు వివరించారు. శాసనసభ సమావేశాల తేదీలను సీఎం నిర్ణయానికి వదిలేసినట్టు తెలిపారు. కర్ణాటక పర్యాటకశాఖ పాలసీ 2024-29ని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో సాహస క్రీడలు, వ్యవసాయం, తీర ప్రాంతం, బీచ్ పర్యాటకశాఖ, పారంపర్య, పర్యావరణ, విద్యారంగం, సాహిత్యం, వైద్యం, గనులు తదితర అన్ని రకాల పర్యాటకానికి వీలుగా ఇందులో అంశాలు పొందుపరిచామన్నారు. కాగా బెంగళూరు ఘనత్యాజ్య నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ షేర్ ప్రమాణాన్ని 49శాతం నుంచి 90కు పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. బెంగళూరు జనరల్ తిమ్మరోడ్డులో కేఎస్‌ఆర్‌పి ఒకటో బెటాలియన్ ఆవరణలో పోలీసుశాఖ సెంట్రల్ కమాండ్ సెంటర్ సహా పూర్తిస్థాయిలో పోలీసు భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.102.80 కోట్లు అంచనాగా ఉందన్నారు.

దేవనహళ్ళి - విజయపుర - హెచ్ క్రాస్ - వేమగల్ - మాలూరు తమిళనాడు సరిహద్దు వరకు 110.40 కిలోమీటర్ల మేర పొడవైన రోడ్డును హైబ్రీడ్ మోడల్‌లో మొత్తం రూ.3,190 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. జాతీయ రహదారి మాదిరిగా పీపీపీ తరహాలో నిర్మించనున్నట్టు తెలిపారు.

హాసన్ నగరసభ అప్‌గ్రేడ్...

హాసన్ నగరసభను మహానగర పాలికెగా అప్‌గ్రేడ్ చేసేందుకు కేబినెట్ ఆమోదించిందన్నారు. బీదర్ విమానయాన కార్యాచరణకు అనుమతి లభించిందన్నారు. వెనుకబడిన వర్గాల విద్యార్థుల హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.39.07 కోట్లు ఖర్చు చేసేందుకు అంగీకారం లభించిందన్నారు. రాయచూరు విశ్వవిద్యాలయానికి వాల్మీకి పేరు పెట్టేందుకు ఆమోదం దక్కిందన్నారు.

దేవెగౌడ అంబులెన్స్‌లో ప్రచారానికి...

- కాంగ్రెస్ మాజీ ఎంపీ వ్యాఖ్యలపై మండిపడ్డ కుమారస్వామి



బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా చన్నపట్టణ నియోజకవర్గంలో ప్రచారానికి మాజీ ప్రధాని దేవెగౌడ అంబులెన్స్‌లో వస్తారంటూ కాంగ్రెస్ మాజీ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కుమారస్వామి మండిపడ్డారు. బెంగళూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ దేవెగౌడ ఎలా ప్రచారానికి వస్తారనేది కాలమే నిర్ణయిస్తుందన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే అశ్వత్ చేసిన వ్యాఖ్యలే డీకే సురేశ్ కూడా చేశారన్నారు. ఇది దేవెగౌడ ఆరోగ్యం పట్ల వారు ఇంతటి దిగజారుడు మాటలు సరికాదన్నారు. గతంలో అశ్వత్ తరఫున దేవెగౌడ పల్లె పల్లె తిరిగి ప్రచారం చేయలేదా అన్నారు. దేవెగౌడ చన్నపట్టణకు వస్తుండడం మనవడి పట్టాభిషేకానికంటూ మాట్లాడడం వారి దిగజారుడికి నిదర్శనమన్నారు. రామనగర జిల్లా చన్నపట్టణ శాసనసభ ఉప ఎన్నికల్లో కేంద్రమంత్రి కుమారస్వామి వారసుడు నిఖిల్ బీజేపీ-జేడీఎస్‌ల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున సీపీ యోగేశ్వర్ బరిలో ఉన్నారు.

హాసనాంబను దర్శించుకున్న సీఎం

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో పరిమితంగా తెరిచే జిల్లా కేంద్రమైన హాసన్ పట్టణంలోని హాసనాంబ ఆలయాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం దర్శించుకున్నారు. మంత్రులు రామలింగారెడ్డి, రాజణ్ణ తదితరులు సీఎంతో ఉన్నారు. సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలో అమర్చిన విద్యుద్దీపాలంకరణను ఓపెన్‌టాప్ వాహనంలో వీక్షించి పులకించారు.



హాసనాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



విద్యుద్దీపాల అలంకరణను వీక్షిస్తున్న సీఎం తదితరులు

వక్ఫ్ భూముల వివాదం...

- వాస్తవాల అధ్యయనానికి బీజేపీ ప్రత్యేక కమిటీ
- రైతుల ఎకరం భూమి కూడా వక్ఫ్‌కు చేరలేదు
- జిల్లా మంత్రి ఎంబీ పాటిల్



మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లాలోని పలువురు రైతులకు భూమి తమకు చెందినదవిగా వక్ఫ్‌బోర్డు నోటీసులు జారీ చేయడం రాష్ట్రమంతటా సంచలనమైంది. అయితే రైతులకు చెందిన ఒక ఎకరం భూమి కూడా వక్ఫ్‌కు చేరలేదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. వాస్తవాలను అధ్యయనం చేసేందుకు బీజేపీ ఎంపీ, మాజీ డీసీఎం గోవింద కారజోళ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ గందరగోళంపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతోపాటు రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారిని ఆదేశించారు. 1974 గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం వక్ఫ్ ఆస్తి మాత్రమే స్వాధీనం చేసుకుంటారని, అయితే కొందరు గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి ఎంబీ పాటిల్ ఆరోపించారు. 1974లో జారీ చేసిన గెజిట్ ప్రకారం విజయపుర నగరంలోని ఖాజా అమీన్ దర్గా సర్వే నంబరు హొనవాడ గ్రామఆస్తిగా నమోదు చేయడం వక్ఫ్‌మండలి ద్వారా 1977లో మార్పులు చేశారు. హొనవాడ గ్రామంలో ఇప్పటివరకు ఎవరికీ నోటీసులు జారీ చేయలేదని, రైతులపేరిటే భూములు ఉన్నాయన్నారు. హొనవాడ గ్రామ పరిధిలో వక్ఫ్‌కు 1500 ఎకరాల భూమి ఉందనే అంశాన్ని నిరాకరించారు. గ్రామంలో కేవలం 10.29 ఎకరాలు మాత్రమే వక్ఫ్‌భూమి ఉందన్నారు. విజయపుర జిల్లాలో వక్ఫ్‌మండలి 14,201 ఎకరాలు గెజిట్‌లో సూచించిన ఆస్తిలో 12,083 భూమిని గతంలోనే భూ సంస్కరణ చట్టం లేదా ఇనాం రద్దు చట్టం తర్వాత వివాదంలో ఉందన్నారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటామన్నారు.

నెలలో 124 నోటీసులు

జిల్లానుంచి ఒక నెలరోజులలో 124 నోటీసులు జారీ చేశారు. 41 ఆస్తులకు సంబంధించి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే స్వాధీనం చేసుకోవాలని సబ్‌డివిజనల్ అధికారులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడం వివాదానికి కారణమైంది. వివాదం తీవ్రం కావడంతో మంత్రి ఎంబీ పాటిల్, జిల్లా అధికారి టి. భూబాలన్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష జరిపారు.

బీజేపీ ప్రత్యేక కమిటీ

వక్ఫ్‌బోర్డు చట్టం ద్వారా విజయపుర జిల్లాలో రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పార్టీ ద్వారా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వీరు వాస్తవాలను పరిశీలించి తగిన నివేదిక రూపొందించనున్నారు. మాజీ డీసీఎం, ఎంపీ గోవింద కారజోళ, ఎమ్మెల్యేలు హరీశ్ పూంజా, మహేశ్ టెంగినకాయతోపాటు మాజీ ఎమ్మెల్సీ అరుణ్ శెహపుర, రైతుమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరుడప్ప కమిటీలో ఉన్నారు. వీరు మంగళవారం విజయపుర జిల్లాను సందర్శించనున్నారు. కాగా విజయపుర ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత బసవనగౌడ పాటిల్ యత్నాళ్ మాట్లాడుతూ వక్ఫ్ అధికారులు ఆలయాలకు నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. జిల్లాకు చెందిన ఏ ప్రాంతంలో రైతుకు వక్ఫ్ నోటీసులు ఇచ్చినా, ఎమ్మెల్యే ఆఫీసును సందర్శించాలని, న్యాయపోరాటం చేసేందుకు ప్రత్యేక అడ్వకేట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయేంద్ర, నాయకులు

ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉపఎన్నికల్లో మూడు చోట్ల గెలిచేందుకు ఎమ్మెల్యేలంతా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పిలుపునిచ్చారు. నగరంలోని మల్లేశ్వరంలో బీజేపీ కార్యాలయం జగన్నాథ భవన్‌లో సోమవారం సంఘటనాపర్వ పేరిట రాష్ట్రస్థాయి సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రంలో 58 వేల బూత్‌లలో సభ్యత్వ నమోదు సాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబరు 2న సభ్యత్వ నమోదు ప్రారంభించారని 40-45 రోజుల్లో దేశవ్యాప్తంగా 10 కోట్లమంది సభ్యత్వ నమోదు సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో 65లక్షలకుపైగా సభ్యులు నమోదు చేసుకున్నారన్నారు. కాగా రాష్ట్రంలో సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ పాలన సాగిస్తోందని అభివృద్ధి పట్ల దృష్టి సారించలేదన్నారు. రైతుల సంక్షేమంపట్ల ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అతివృష్టి, అనావృష్టి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. 3 శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలకు ఒక్కో నియోజకవర్గానికి 10మంది మంత్రులకు, ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగించారన్నారు. ఎన్నికల్లో విజయం కోసం అధికార పార్టీకి దీటుగా బీజేపీ నాయకులు, ఎమ్మెల్యేలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ సుధాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, సంఘటనా పర్వ ఎన్నికల అధికారి కెప్టెన్ గణేశ్‌కార్తిక్, ఎమ్మెల్సీ ఎస్ రవికుమార్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

డోలాయమానంలో అజ్జంపీర్..!

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా శిగ్గావి శాసనసభ ఉప ఎన్నికల చివరిక్షణంలో నామినేషన్ దాఖలుచేసి ఆ మరుసటిరోజే సీఎం, డీసీఎంలను కలిసిన కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థి అజ్జంపీర్ డోలాయమానంలో పడ్డాడు. సోమవారం విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయకుంటే కార్యకర్తలు నాపై దాడి చేస్తారన్నారు. నామినేషన్ ఉపసంహరణ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. నాకు భయం పట్టుకుందని, భోజనం చేయలేకపోతున్నానని, నిద్ర రావడం లేదన్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌లు పిలిపించి చర్చలు జరిపారన్నారు. 23ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్నానని, ఆర్థికంగా శక్తివంతం కాకపోయినా కార్యకర్తలు నాకు అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతల వద్దకు వెళితే లాకప్‌లో ఉన్నట్టే నన్నారు. నామినేషన్ ఉపసంహరించకుంటే కొందరు కార్యకర్తలు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారన్నారు. శిగ్గావి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని, సీఎం, డీసీఎంలతోపాటు మంత్రిని కోరుతున్నా అన్నారు. నాకు పోలీస్ సెక్యూరిటీ ఇచ్చారన్నారు. నాలుగుసార్లు ఎన్నికల్లో ఓటమి చెందానన్నారు. అందుకే టిక్కెట్ నిరాకరించారన్నారు. నేను ఓడినా కాంగ్రెస్‌లోనే ఉంటానన్నారు. నామినేషన్ ఉపసంహరణ విషయం గందరగోళంగా మారిందన్నారు. కాగా నామినేషన్ ఉపసంహరణకు ఇంకా రెండు రోజుల గడువు ఉండడంతో ఆయన ఎలా వ్యవహరిస్తారనేది వేచి చూడాలి.



ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న నిర్మలానందనాథ స్వామీజీ

దుబాయ్‌లో ఘనంగా...

కెంపేగౌడ ఉత్సవం

బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర నిర్మాత, నాడప్రభు కెంపేగౌడను స్మరిస్తూ కన్నడ పరంపర, సంస్కృతిని చాటేలా దుబాయ్ కన్నడ సంఘాల సమాఖ్య, దుబాయ్ ఒక్కలిగుల సంఘం సహకారంతో కెంపేగౌడ ఉత్సవాన్ని దుబాయ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదిచుంచనగిరి పీఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కన్నడిగుల ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమం ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. నాడప్రభు కెంపేగౌడ ఆదర్శాలను స్మరిస్తూ ఆయన స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కర్ణాటకలో వివిధ రంగాలలో రాణించివారిని సత్కరించారు. పశుసంవర్ధకశాఖ మంత్రి వెంకటేశ్, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి సిటీ రవి, ఎమ్మెల్యే రవికుమార్ గణిగ, సినీ నటుడు ఉపేంద్ర ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు కిరణ్‌గౌడ మాట్లాడుతూ దుబాయ్ ఒక్కలిగ సంఘం అధ్యక్షులు, ఇతరులు మన సంస్కృతి కన్నడ సంప్రదాయాలను భావితరాలకు అందేలా కెంపేగౌడ ఆశయాలు చాటేలా ఉత్సవం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నటుడు ఉపేంద్ర మాట్లాడుతూ మన భాషా సంస్కృతుల మనుగడకు ఇలాంటి కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రతి ఏటా ఇలా కార్యక్రమాలు కొనసాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంగీత, నృత్య ప్రదర్శనలు అలరించగా సామాజిక సేవా ప్రముఖులను సత్కరించారు.

న్యూస్‌బాక్స్

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మలోల

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ ఆఫీసర్(డీఆర్‌ఓ)గా మలోల బాధ్యతలు స్వీకరించారు. జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న మలోలను జిల్లా డీఆర్‌ఓగా ప్రభుత్వం నియమించింది. నూతన డీఆర్‌ఓ మలోల సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఉదయమే కలెక్టరు వినోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రస్తుతం బదిలీ అయిన డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీఆర్‌ఓకు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లు అభినందనలు తెలిపారు.

చెస్‌లో చిన్నారి ప్రతిభ

- ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన శమిక



సాధించిన పతకాలతో కాశి శమిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కాశి శమిక చెస్‌లో అద్భుత ప్రతిభ చూపి ఒకే సారి మూడు పతకాలు సొంతం చేసుకుంది. విజయవాడలో ఈనెల 22 నుంచి 27 వరకు బీఎన్‌కే ఫౌండేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగ సమాఖ్య, ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ ప్రథమ ఇంటర్నేషనల్ ఫిడే చెస్ ఫెస్టివల్-2024ను నిర్వహించారు. ఇందులో వివిధ దేశాల నుంచి సుమారు 1500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి కాశి శమిక క్లాసికల్ అండర్-7 బాలికల విభాగంలో ఐదో స్థానం, ర్యాపిడ్‌లో నాలుగో స్థానం, బ్లిట్జ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన క్రీడాకారిణి శమికను కోచ్‌లు ఉదయ్‌కుమార్ నాయుడు, గోవింద రాజులు అభినందించారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13పలికినట్లు ఆయన తెలిపారు.

వాన దెబ్బ



బొమ్మనహాళ్ మండలంలో మొక్కజొన్న పంటను ఇటీవల ముంచెత్తిన వరద నీరు

జిల్లావ్యాప్తంగా గత వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం తీవ్రంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 591.38 హెక్టార్లల్లో రూ.3.96 కోట్ల పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపారు. క్షేత్ర స్థాయిలో లోతుగా పరిశీలిస్తే పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోతకొచ్చిన మిరప, పత్తి, ఇతర రకాల పంటలు భారీ వర్షానికి దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

- అనంతపురం అర్బన్/పామిడి/బొమ్మనహాళ్ (ఆంధ్రజ్యోతి)

- భారీ వర్షానికి తీవ్ర పంటనష్టం
- ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు
- 591.38 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు
- నష్టపరిహారం కోసం అన్నదాతల వేడుకోలు

134.46 హెక్టార్లలో ఉద్యాన పంటల నష్టం

భారీ వర్షాలకు జిల్లాలోని 15 మండలాల్లో 119 మంది రైతులకు చెందిన 134.46 హెక్టార్లల్లో రూ.1.30 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం, కూడేరు, పామిడి, కంబదూరు, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల, బెళుగుప్ప మండలాల్లో మిరప, టమోటా, వంకాయ, దానిమ్మ, కాకర, చీనీ, కర్బూజ, ద్రాక్ష, అరటి, మామిడి, ఉసిరి, బీర పంటలు దెబ్బతిన్నాయి.



పామిడి మండలంలో వానకు తడిసిన పత్తిని ఆరబెట్టిన రైతులు

వ్యవసాయశాఖలో రూ. 2.66 కోట్ల పంటనష్టం

వ్యవసాయ శాఖ పరంగా జిల్లాలోని 14 మండలాల్లో 481 మంది రైతులకు చెందిన 456.92 హెక్టార్లల్లో రూ.2.66 కోట్ల పంట నష్టం జరిగింది. అనంతపురం, గార్లదిన్నె, కణేకల్లు, నార్పల, గుమ్మగట్ట, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల, పెద్దవడుగూరు మండలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.



దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

మిరప దెబ్బతింది



ఏడెకరాల్లో ఎండు మిరప పంట సాగు చేశా. ఇందులో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట పెట్టా. మరో ఎకరాలో పచ్చిమిరప సాగు చేశా. ఎండు మిరప పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో పూర్తిగా దెబ్బతింది. చెట్లపై ఎండు మిరప కాయలు బూజుపట్టి కుళ్లిపోతున్నాయి. తద్వారా రూ.5 లక్షలకుపైగా నష్టం వచ్చింది. పచ్చి మిరప కోత దశలో ఉన్నప్పుడు వర్షం పడటంతో పూర్తిగా దెబ్బతింది.

- విజయభాస్కర్‌రెడ్డి, అనుంపల్లి, పామిడి మండలం

ఉద్యాన పంటల నష్టం వివరాలు...

పంట	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
మిరప	73.80	64.41
టమోటా	27.20	21.76
కాకర	0.80	0.48
ద్రాక్ష	2.00	4.00
చీనీ	8.40	9.64
అరటి	6.60	16.50
దానిమ్మ	2.00	2.40
ఉసిరి	2.00	1.60
మామిడి	4.00	4.00
కర్బూజ	6.00	4.80
వంకాయ	1.00	0.60
బీర కాయ	0.66	0.40
మొత్తం	134.46	రూ.1.30 కోట్లు

వ్యవసాయ శాఖ పరంగా పంటనష్టం వివరాలు

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
వరి	273.1	156.65
పత్తి	11.0	5.48
మొక్కజొన్న	111.8	75.29
జొన్న	11.0	6.05
వేరుశనగ	48.0	22.26
నువ్వులు	2.0	0.3
మొత్తం	456.92	రూ.2.66 కోట్లు

పంట తడిసిపోయింది..



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. పంట మొదటి కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం పడటంతో పత్తి దెబ్బతింది. వానకు పత్తి పంట పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటి దాకా ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టా. వానకు తడిసిన పత్తిని వదిలేయలేక తొలగించి ఇంట్లో ఆరబెట్టుకున్నా. పత్తి రంగు మారడంతో వ్యాపారులు కొంటారో లేదో అర్థం కావడం లేదు. భారీ వర్షానికి పత్తి పంటను గులాబీ పురుగు ఎక్కువగా ఆశిస్తోంది. దీనికి మందులు పిచికారి చేయాలంటే అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిందే. వ్యవసాయ అధికారులు పత్తి పంట దెబ్బతిన్నట్లు రాసుకొని వెళ్లారు. పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

-రామలింగారెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం

పంటంతా మునిగిపోయింది



వరద నీటిలో పంటంతా మునిగిపోయింది. రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మరో రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కోతకువచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో వేదావతి, హగరి నది నుంచి వచ్చిన వరద నీరు మొక్కజొన్న, పత్తి పంటను ముంచేసింది. దీంతో మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలుగు ఎకరాల్లో రెండు పంటల సాగు కోసం రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికే పంటల సాగు కోసం రూ.6 లక్షలు అప్పు చేశా. ఈ సారి పంట చేతికొచ్చి ఉంటే రూ.4లక్షలదాకా అప్పు తీరేది. వరదనీటితో పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

-ఆంజనేయులు, ఏలంజి, బొమ్మనహాళ్ మండలం

భారీగా టపాసుల స్వాధీనం



ఐషర్ వాహనంలోకి లోడ్ చేస్తున్న టపాసులు

యల్లనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా భారీమొత్తంలో నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ సత్యబాబు, ఎస్ఐ రాంప్రసాద్ సోమవారం ఉదయం 8గంటల సమయంలో గిర్రమ్మబావి సమీపంలోని గృహాల్లో సోదాలు నిర్వహించారు. ఒక ఇంటిలో భారీగా నిల్వ ఉంచిన టపాసులను చూసి అధికారులు అవాక్కయ్యారు. ఇంటి యజమానిని పిలిపించి వాటి గురించి ఆరాతీశారు. తాడిపత్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు తరచూ ఇక్కడ టపాసులు నిల్వ ఉంచుకొనే వారని విచారణలో తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వెంటనే అక్కడ ఉన్న టపాసులను ఒక ఐషర్, నాలుగు చిన్న వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. మూడు వాహనాల్లో సరుకు స్టేషన్‌లో ఉంచగా, మిగిలిన రెండు వాహనాల సరుకును స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రైవేట్ రూంలో ఉంచారు. వీటివిలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల దాకా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

- కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్న టపాసులను వాహనాల్లో తీసుకువచ్చి ప్రైవేట్ రూములో ఉంచడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. సీజ్‌చేసిన చోట నుంచి సురక్షితమైన ప్రాంతానికి తరలించకుండా, నివాస ప్రాంతాల్లో ఎందుకు తీసుకువచ్చి ఉంచారో అని చర్చించుకుంటున్నారు.

రూ.11వేల టపాసులు సీజ్

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలోని ఒక దుకాణంలో సోమవారం రూ.11వేలు విలువగల టపాసులు సీజ్‌చేసినట్లు ఏఎస్ఐ నాగన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేయగా దుకాణంలో విక్రయాలు జరుపుతున్నాడని తెలిసి వాటిని సీజ్ చేశామన్నారు. విక్రయాలు జరుపుతున్న రాజగోపాల్‌ను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

70 తులాల వెండి నగల అపహరణ



ఆభరణాలులేని అమ్మవారి విగ్రహం

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొట్టాల గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ పెద్దలు తెలిపిన మేరకు 2024 ఫిబ్రవరిలో పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించి, నూతన విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో అనేక మంది అమ్మవారికి వెండి ఆభరణాలు సమర్పించారన్నారు. వాటిని తరచూ అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే శనివారం కూడా అమ్మవారికి వెండి కిరీటం, వెండి నగలు, ముక్కుపుడక, తాళి చైను తదితర ఆభరణాలు అలంకరించి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి వరకూ ఆలయంలో పూజలు, భజనలు నిర్వహించి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తిరిగి సోమవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వెళ్లగా బయటి వాకిలి(తలుపులు)కి ఉన్న తాళం కనిపించలేదన్నారు. ఇనుప వాకిలి వంగిపోయి, సిమెంట్ పెచ్చులు ఊడిపోవటంతో అనుమానం వచ్చి గుడిలోకి వెళ్లి చూడగా అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, నగలు దాదాపు 70 తులాలు కనిపించలేదని తెలిపారు. చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చి విడపనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జీడిపల్లిలో 1.681 టీఎంసీల నీరు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో సోమవారం 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1141 క్యూసెక్కులు వుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,101 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అమిలినేని



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల వారు తయారుచేసిన వివిధ రకాల వస్తువుల విక్రయం, అర్బన్ మార్కెట్‌ను ఆయన టీడీపీ పరిశీలకుడు నాగేశ్వరరావుతో కలిసి సోమవారం టీ సర్కిల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని చేతివృత్తులు, ఇతర వ్యాపారాలు చేస్తున్న మహిళల వద్ద నాణ్యమైన వస్తువులు ఉంటాయన్నారు. వారి వద్ద వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా వారిని మనం ఆర్థికంగా ఆదుకోవచ్చన్నారు. పార్టీ పరిశీలకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కార్యకర్తల కుటుంబాల ఇబ్బందులు పడకూడదని బీమా అందిస్తున్న పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం ఐదో స్థానంలో ఉందని, 50 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసి మొదటి స్థానంలో నిలబడేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

జిల్లా హాకీ జట్టుకు పాల్తూరు విద్యార్థులు

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14మంది ఎస్‌జీఎఫ్ హాకీ జిల్లా జట్టుకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 23న అనంతపురంలో ఎస్‌జీఎఫ్ వారు నిర్వహించిన హాకీ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. అండర్- 17 విభాగంలో పి.నందు, పి.కుమార్ స్వామి, సి.పృథ్వీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో శశికళ, ప్రియాంక, జుబేదా భాను ఎంపికైనట్లు వెల్లడించారు. అండర్-14 విభాగంలో బాలురు వనేష్, సుధీర్, బాలరాజు, మేఘనాథ్, శశికుమార్, బాలికలు బీడీ మల్లిక, మానస, ప్రియాంక ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్-17 విభాగంలో హాకీ పోటీలు నవంబరు 3 నుంచి 5వరకూ నెల్లూరులో జరుగుతాయన్నారు. అండర్ -14 పోటీలు నవంబరు 8 నుంచి 10 వరకూ అనకాపల్లిలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థినీవిద్యార్థులు

నిజాయతీగా పనిచేద్దాం: డీఆర్ఎం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీతో పారదర్శకంగా పని చేద్దామని రైల్వే ఉద్యోగులతో డీఆర్ఎం విజయకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకుని తన కార్యాలయం బయట సోమవారం ఉదయం ఉద్యోగులను సమావేశపరిచారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, పనిలో పారదర్శకత, అవినీతి రహిత కార్యాచరణ ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జేపీ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైళ్ల భద్రత విషయంగా సకాలంలో స్పందించి అప్రమత్తంగా వ్యవహరించిన నలుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులు ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం జీఎం అరుణ్ కుమార్ జైన్, ఏజీఎం నీరజ్ అగర్వాల్ ఆధ్వర్యంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లోని ఆరు డివిజన్ల అధికారులతో రైళ్ల భద్రతపై ఆన్‌లైన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ వ్యాప్తంగా 15 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. ఇందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని నలుగురు ఉద్యోగులు, సికింద్రాబాద్, విజయవాడ, నాందేడ్ డివిజన్‌లో ముగ్గురు చొప్పున, గుంటూరు డివిజన్‌లో ఇద్దరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో జోన్ పరిధిలోని ఆరు డివిజన్ల డీఆర్ఎంలు పాల్గొన్నారు.

మార్పే సమస్యలకు పరిష్కారం

సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చడమే ప్రజా సమస్యలకు అంతిమ పరిష్కారం అని మాజీ ఎమ్మెల్సీ సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో 'లెనినిజం - నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిచారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించగా, ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మరల్చడమే పాలకుల విధానం అన్నారు. ప్రస్తుతం దేశంలో నూతన సంస్కరణల పేరుతో అమలవుతున్న విధానాలు అదానీ, అంబానీ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. దేశంలో కొద్దిమందిగా ఉన్న వారు అత్యధికమంది ప్రజలను కొల్లగొడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తం గా కార్మికవర్గ వేతనాలు పెరగని పరిస్థితి ఉందన్నారు. లెనినిజం ప్రభా వం ఉత్పన్నమవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్ నిరంకుశం వల్లే వైసీపీని ప్రజలు ఓడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, బాషా, డాక్టర్ వీరభద్రయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, నాగేంద్ర, లెనిన్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు అపుస్మా సాయం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ వరద బాధితుల సహాయార్థం అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీగా విరాళం అందించారు. అపుస్మా జిల్లా నాయకులు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు కుసుమ పుల్లారెడ్డి, నాయుడు, నాగపీరయ్య ఆ సంఘం ద్వారా అనంతపురం జిల్లా శాఖ తరఫున రూ. 10 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తమ రాష్ట్ర అసోసియేషన్ తరఫున మొత్తం రూ. 75 లక్షల చెక్కును సీఎంకు అందించినట్లు తెలిపారు. తర్వాత రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్ల ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

వైఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



ఓబుళపతి




గిరిధర్ రెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం కొత్త అధ్యక్షుడు ఓబుళపతి సోమవారం తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నూతన కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రాజమోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఓబుళపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిరిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే అధికార ప్రతినిధిగా రియాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా సురేష్‌కుమార్, గంగిరెడ్డి, వెంకటరెడ్డి, కార్య దర్శులుగా మల్లయ్య, విశ్వనాథరెడ్డి, ఆదినారాయణ స్వామిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. వారంతా రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ఆయన ప్రకటించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

నాయని సుబ్బారావు (జయంతి)



తొలితరం 'తెలుగు భావకవి'గా గుర్తింపు పొందిన నాయని సుబ్బారావు 1899 అక్టోబరు 29న ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాటం, సహాయ నిరాకర ణోద్యమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఆయా ప్రసారాలకు అవసరమయ్యే విషయాలను రాసేవారు. ఎక్కువగా గ్రామస్థుల కార్యక్రమాలకు రాసేవారు. వివిధ అంశాలపై రాసిన 25 ఖండికలను 'భాగ్యనగర కోకిల'గా ప్రచురించారు. సౌభద్రుని ప్రణయయాత్ర అనే ఆత్మకథాత్మక కావ్యం, వేదనా వాసుదేవము, విషాద మోహనం స్మృతి కావ్యాలు, జన్మభూమి అనే మహాకావ్యం ఎంతో గుర్తింపు పొందాయి. 1978 జూలై 8న కన్నుమూశారు.

వాలి (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత తమిళ కవి, గేయరచయిత వాలి 1931 అక్టోబరు 29న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగం ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు టీఎస్ రంగరాజన్. తమిళ సినీరంగంలో ఐదు దశాబ్దాల్లో 15వేలకుపైగా పాటలు రాశారు. అంతేకాక పలు సినిమాలలో సైతం నటించారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమ గేయ రచయిత పురస్కారాన్ని ఐదుసార్లు పొందారు. అమ్మవారిపై ఆయన రాసిన పాటను మధురై ఆలయంలో రాయిపై చెక్కించారు. ఎన్నో గౌరవాలు, పురస్కారాలు అందుకున్నారు. 2013 జూలై 18న కన్నుమూశారు.

మాథ్యూ హేడెన్ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియా దేశ ప్రముఖ క్రికెటర్ మాథ్యూ హేడెన్ 1971 అక్టోబరు 29న జన్మించారు. క్రికెట్ కామెంటేటర్‌గాను రాణించారు. 6.2 అడుగుల పొడగరి. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందారు. 15ఏళ్ల కెరీర్‌లో టెస్టుమ్యాచులలో వ్యక్తిగత స్కోరు 380 పరుగులతో రికార్డు కలిగారు. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌మెన్, కుడిచేత్తో బౌలింగ్ అలవాటు, లెగ్‌స్పిన్ ప్రత్యేకత. 2009లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 2017లో ఆస్ట్రేలియన్ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు దక్కించుకున్నారు. 2021లో పాకిస్థాన్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించారు. కాగా 3 వంటల పుస్తకాలు కూడా రాయడం విశేషం.

విజేందర్‌సింగ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విజేందర్‌సింగ్ 1985 అక్టోబరు 29న హర్యానా రాష్ట్రం భివాని జిల్లా కలువాస్ ప్రాంతంలో జన్మించారు. బాక్సింగ్ క్రీడాకారుడు. 2000లో జాతీయ పోటీలలో తొలి బంగారు పతకాన్ని సాధించారు. 2003లో ఆలిండియా యూత్‌బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించారు. 2009 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, 2010 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ రాణించారు. ఆ తర్వాత ఏటా పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. ఇంతవరకు 13 ఫైట్‌లు చేయగా 12 గెలుపొందడం విశేషం. మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు, అర్జున అవార్డు పొందారు. ఇటీవల ఆయన బీజేపీలో చేరారు.

స్వప్న బర్మన్ (పుట్టినరోజు)



స్వప్న బర్మన్ 1996 అక్టోబరు 29న పశ్చిమబెంగాల్ రాష్ట్రం జల్పైగురి పట్టణ ప్రాంతంలో జన్మించారు. ఆమెకు ఒక్కోకాలికి ఆరు వేళ్లు ఉండడం గమనార్హం. 2017 ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో హెప్టాథ్లాన్ విభాగంలో తొలిస్థానంలో నిలిచారు. 2018 ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించగా 2019లో అర్జున అవార్డు అందుకున్నారు. 2022 నేషనల్ గేమ్స్‌లో హెప్టాథ్లాన్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. రాహుల్ ద్రావిడ్ అథ్లెట్ మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌కింద శిక్షణ పొంది అథ్లెట్స్‌గా రాణించడం విశేషం.

సమస్యల వలయంలో సంపంగినగర్



ఎటు చూసినా కంపచెట్లు ఇలా..



బోరునీటి కొళాయి వద్ద కొరవడిన స్వచ్ఛత

బాగేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణానికి అనుబంధంగా ఉండే సంపంగినగర్ ప్రాంతం సమస్యలమయంగా మారింది. సుమారు రెండు దశాబ్దాలక్రితం అప్పటి ఎమ్మెల్యే సంపంగి అవధిలో పేదలకు ఉచిత ఇంటిస్థలాలు కేటాయించారు. దీంతో లబ్ధిదారులు ఆ లే అవుట్‌కు ఆయన పేరు పెట్టారు. అప్పటి నుంచి సంపంగినగర్‌గా పిలవబడుతోంది. తగిన మౌలిక సదుపాయాలు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. పట్టణానికి అనుబంధంగా ఉన్నప్పటికీ తాగునీటికోసం కిలోమీటర్ల కొద్దీ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. నిత్యావసరాలకు బోరు ఉన్నా ఆ నీరు దుర్వాసనతో ఉంటున్నా గతిలేక ఆ నీటిని వాడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఒక వీధి రోడ్డుకు తారు సదుపాయం లేదని, డ్రైనేజీ వ్యవస్థ అసలే లేదంటున్నారు. ఇంటి సమీపంలోనే ఒక గుంతలో మురుగునీటిని వదులుతున్నారు. స్థానికంగా ఇళ్ల చుట్టూ సరైన పర్యవేక్షణ లేక కంపచెట్లు పెరిగాయి. దోమలబెడద ఉందని, బోరుబావి లేదా వీధిలైట్లు మరమ్మత్తుకు గురైతే తాము సొంత ఖర్చుతో చేయించుకోవాల్సి వస్తోందని లే అవుట్ వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఘంటంవారిపల్లి గ్రామ పంచాయతీ, పురసభల నడుమ తమ లే అవుట్‌ను ఎవరూ పట్టించుకోలేదంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

స్థానికుల అభిప్రాయాలిలా...

అంగన్‌వాడీ గానీ, స్థానికంగా ప్రాథమిక పాఠశాలగానీ లేదు. స్థానికుడు రాము మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, పురసభల మధ్య తలెత్తిన విభేదాలతో తమ లే అవుట్ అభివృద్ధికి నోచుకోవడం లేదని పలుమార్లు వినతులు అందచేసినా ప్రయోజనం దక్కలేదని విచారం వ్యక్తం చేశారు. స్థానికురాలు వీణా మాట్లాడుతూ సమీపంలోనే చెరువు ఉండడంతో పిల్లలను ఆటలాడుకోవడానికి వీధిలోకి పంపడానికి భయపడుతున్నామని, సరైన తాగునీరు, రోడ్డు సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యేను కోరుతున్నట్టు తెలిపారు. రిటైర్డు ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సంపంగి హయాంలో ఉచిత స్థలం దక్కినా ఇంతవరకు ఎలాంటి రికార్డులు చేతికి రాలేదన్నారు. లే అవుట్‌కు సంబంధించి కోర్టులో దావా ఉండడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి లే అవుట్ వాసులకు న్యాయం చేయాలని కోరారు.

పర్యావరణహితంగా పండుగ చేసుకోవాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న అళిలు సంస్థ సభ్యులు

బంగారపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను సంప్రదాయాలతోపాటు పర్యావరణహితంగా ఆచరించాలని అళిలు సేవా సంస్థ సభ్యుడు శ్రవణ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా పర్యావరణ కాలుష్యం కాకుండా చక్కటి విధానాలతో పాటిద్దామన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటైన బాణాసంచా దుకాణాలకు వచ్చేవారికి అళిలు సంస్థ ఆధ్వర్యంలో ఒక మొక్కను, మట్టి దీపాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల వాయుకాలుష్యం క్రమేపీ అధికమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణానికి హాని కలిగించని బాణాసంచా కాల్చాలన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలని ఆకాంక్షించారు. శబ్దకాలుష్యం, వాయుకాలుష్యం నియంత్రించేందుకు పిల్లలు, పెద్దలు సాధారణ బాణాసంచాకు బదులు ప్రభుత్వం సూచించే గ్రీన్ పటాకీలు వాడాలన్నారు. రసాయనాలు, భారీ శబ్దం వచ్చే బాణాసంచా వాడరాదన్నారు. కాగా దీపాన్ని వెలిగించడం అజ్ఞాన చీకట్లు తొలగించే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా అళిలు సంస్థ సభ్యులు సచ్చిదానంద, విశ్వనాథ్, మనోజ్, మహేశ్ బాబు, సుష్మా, రంజిత్, వరుణ్, హితేశ్, కుసుమా, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మళ్ళూరులో ఉచిత వైద్య పరీక్షా శిబిరం

శిడ్లఘట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళ్ళూరులోని మల్లిశెట్టి ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇదే సందర్భంగా యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఆరోగ్యకేంద్రం ముఖ్యులు డాక్టర్ సందీప్ పువ్వాడ మాట్లాడుతూ బెంగళూరులోని ఎంఎస్ రామయ్య మెడికల్ కళాశాల సహకారంతో ఆదివారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శిబిరంలో డెంటల్, కేన్సర్, హృద్రోగ పరీక్షలు చేశారు. దీంతోపాటు నేత్ర పరీక్షలు, చర్మరోగం, చిన్నారులు, మహిళలు, గర్భిణీలకు పరీక్షలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో 450మందికి ప్రయోజనం పొందారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందచేశారు. శిబిరార్థులకు భోజన వ్యవస్థ కల్పించారు. శిబిరంలో డాక్టర్‌లు జ్యోతి, ప్రసాద్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత

పునీత్ కాంస్య విగ్రహావిష్కరణ



పునీత్ విగ్రహావిష్కరణలో పునీత్ భార్య అశ్విని తదితరులు

బెంగళూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రత్న, నటుడు పునీత్‌రాజ్‌కుమార్ వర్ధంతి నేపథ్యంలో నగరంలోని యడియూరు వార్డు సౌత్ ఎండ్ సర్కిల్‌లో పునీత్ నూతన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో పునీత్ భార్య అశ్విని, ప్రతిపక్షనేత అశోక్, స్థానిక బీజేపీ నాయకుడు ఎన్ఆర్ రమేశ్, మాజీ కార్పొరేటర్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ నటుడు పునీత్ సామాజిక సేవలు నేటికీ ఆదర్శనీయమన్నారు.

ప్రశాంతంగా ఉద్యోగుల సంఘం ఎన్నికలు



కళాశాల వద్ద ఓటర్ల సందడి ఇలా..

చింతామణి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుతత్వ మహాత్మాగాంధీ ప్రభుత్వ పీయూ కళాశాల ఆవరణలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక ఉపాధ్యాయుల విభాగం నుంచి 818మంది ఓటర్లు ఉండగా 9మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. హైస్కూల్ విభాగం నుంచి 192మంది ఓటర్లు ఉండగా ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెవెన్యూశాఖ నుంచి 78మంది ఓటర్లు ఉండగా ముగ్గురు బరిలో నిలిచారు. ఆరోగ్య శాఖ నుంచి 120మంది ఓటర్లు ఉండగా ఇద్దరు పోటీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా శాఖ డైరెక్టర్‌ల స్థానాలకు సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మొత్తం 33 డైరెక్టర్‌ల స్థానాలకై 23మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పది స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికలసంఘం అధికారులుగా కేఎం రమణారెడ్డి, జగదీశ్వరరెడ్డి వ్యవహరించారు.

పొంచి ఉన్న ప్రమాదం




ప్రమాదపు అంచున కసాపుర చెరువుకట్ట

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒకవైపు చెరువులు నిండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నా.. చెరువుగట్లు కూలుతుండడంతో ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూడ్లిగి తాలూకా గుడేకోట గ్రామ పంచాయతీ కసాపుర గ్రామ చెరువు వర్షపు నీటితో నిండుకుండలా మారింది. మరో వైపు చెరువుగట్టు కూలుతుండడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుగట్టు దెబ్బతిని కూలుతున్న విషయం స్థానిక అధికారులకు తెలిపినా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

సండూరు కోటపై హస్తానిదే పైచేయి..!

- జేడీఎస్ ఒక్కసారి మినహా అన్నింటా కాంగ్రెస్‌దే విజయం
- ఈ ఉప ఎన్నికలో గెలుపెవరిదో..?





బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరుగుతున్న సండూరు, చెన్నపట్టణ, శిగ్గావి శాసనసభ ఉప ఎన్నికల వేడి ఊపందుకుంది. మూడింటిలో సండూరు ఉప ఎన్నిక మరింత ప్రతిష్ఠాత్మకంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తీసుకున్నాయి. రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు బళ్లారి జిల్లా అనేది విశ్లేషకులకు తెలుసు. ఈ ఉప ఎన్నికలు బీజేపీ-కాంగ్రెస్ రెండు పార్టీలూ గెలుపునకు బలంగా తలపడుతున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో 2004లో జేడీఎస్ నుంచి పోటీ చేసిన సంతోష్ లాడ్ గెలవగా మిగిలిన అన్నిసార్లూ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. 1972లో ఎంవై గోర్పడే కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1978లో సీ. రుద్రప్ప, 1983లో హీరోజీ వి.ఎస్ లాడ్ గెలుపొందరు 1985లో జనతాపార్టీనుంచి యు. భూపతి విజయం సాధించారు. 1989, 1994, 1999లో ఎం.వై గోర్పడే కాంగ్రెస్ నుంచి మూడుసార్లు గెలుపొందారు. 2004లో జనతాదళ్(ఎస్) నుంచి సంతోష్-లాడ్ గెలిచారు. 2004 ఎన్నికల తరువాత రిజర్వేషన్లు మారాయి. సండూరు ఎస్టీ రిజర్వుడు అయింది. అప్పటి నుంచి కూడా కాంగ్రెస్ గెలుస్తూనే వస్తుంది. 2008లో లాడ్ ఫ్యామిలీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులను గెలిపించుకుంటున్నారు. 2008, 2013లో ఇ. తుకారాం, 2013లోఁకాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఇ. తుకారాం మే విజయం సాధించారు. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లోనూ ఆయనే గెలిచారు. ఇంతవరకూ బీజేపీ ఇక్కడ బోణీ కొట్టలేదు. బీజేపీ నుంచి బలంగా పోటీ ఇస్తున్నారే కానీ విజయం కాలేకపోయారు.

2023లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచిన తుకారాం 2024లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. బీజేపీ అనూహ్య రాజకీయ వ్యూహం పన్నింది. ఇక్కడున్న బీజేపీ పాత నాయకులకు కాదని కొత్తగా బంగారు హనుమంతును దించింది. బీజేపీ కూడా ఈసారి గట్టిగానే గెలుపుకోసం పోరాడుతోంది. అన్ని శక్తులనూ కూడగట్టుకుని రాజకీయ యుద్ధరంగంలో దిగింది. ఇక కాంగ్రెస్ కూడా అంత తేలిగ్గా తీసుకోవడం లేదు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఉన్న 20 మంది మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు ఇక్కడ ప్రచారం సాగిస్తున్నారు. రెండు పార్టీల్లోనూ రాజకీయ ఎత్తులు, జిత్తులు వేసే నాయకులు ఉన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో మునుపటిలాగా కాంగ్రెస్‌కు అండగా ఉంటారా.. బీజేపీకి అవకాశం ఇస్తారా అనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు.

మాజీ సీఎం కేజ్రీవాల్‌పై దాడి అమానుషం

రాయచూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆమ్‌ఆద్మీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేజ్రీవాల్‌పై దాడి అమానుషమని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకులు ఖండించారు. దాడిని అన్ని పార్టీలు, పౌరులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దాడికి బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని, వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ జిల్లాధికారి ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు మాట్లాడుతూ డిల్లీలోని వికాస్‌పుర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్‌పై బీజేపీ యువమోర్చా నాయకులు దాడికి దిగడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంలో నిందితుల పట్ల కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శాంతరాజ కమిటీ సిఫార్సులు తిరస్కరించాలి

రాయచూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల గణన ఆధారంగా పదే ఏళ్ల క్రితం చేపట్టిన శాంతరాజ కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన సిఫార్సులను తిరస్కరించాలని వీరశైవ లింగాయత్ మహాసభ ప్రతినిధులు కోరారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్దకు వచ్చిన మహాసభ ప్రతినిధులు ఏడీసీ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. వీరశైవ లింగాయత్ ప్రధాన సమాజంతోపాటు ఉప కులాలుగా ఉన్న అనేక వాటి విషయంలో కమిటీ ఇచ్చిన సిఫార్సులు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. వాటికి ఎలాంటి శాస్త్రీయత లేదని లోపభూయిష్టంగా ఉన్న ఈ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించవద్దని కోరారు. దీంతో పాటు వీరశైవ లింగాయత్ సమాజంలోని ఉప కులాలన్నింటినీ బీసీలుగా పరిగణించాలని ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తగిన సిఫార్సులు చేయాలని కోరారు. కార్యక్రమంలో నీలగల్ మఠాధిపతి పంచాక్షర మహాస్వామి నగరానికి చెందిన కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య మహాస్వామి పాల్గొన్నారు.

డిస్కస్‌త్రోలో రాష్ట్రస్థాయికి రాజశేఖర్



విద్యార్థి రాజశేఖర్‌కు అభినందన

బాగేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పాతపాళ్య ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాజశేఖర్ ఇటీవల చిక్కబళ్లాపుర జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో డిస్కస్‌త్రోలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. దీంతో ఇతను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం విద్యార్థి రాజశేఖర్‌ను పాఠశాల తరఫున ప్రత్యేకంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లప్ప మాట్లాడుతూ రాజశేఖర్ జిల్లాస్థాయి పోటీల్లో రాణించి పాఠశాల కీర్తిని తాలూకా, జిల్లాస్థాయిలో ఇనుమడింప చేశారని అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని అభిలషించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సిద్రామప్ప కరిగౌడ మాట్లాడుతూ విద్యార్థులు పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో కూడా సత్తా చాటుకోవడం ద్వారా పేరొందాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎస్ఆర్ సురేంద్రబాబు, ఎంఎస్ శ్రీనివాసన్, జి సబ్రాయప్ప, రవిచంద్రన్, మౌనేశ్, శిరీశ, ఎస్‌డిఎంసి అధ్యక్షుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్ రెజ్లింగ్‌లో రాణించిన శ్రీధర్



జాతీయపతాకంతో విజేత శ్రీధర్

దొమ్మసంద్ర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామానికి చెందిన శ్రీధర్ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటుకుంటున్నారు. ముంబైలో ఈనెల 19 నుంచి 27వరకు జరిగిన ఏసియన్ ఇంటర్నేషనల్ ఆర్మ్ రెజ్లింగ్ కప్ 2024లో రాణించారు. 8వ ఆర్మ్ రెజ్లింగ్ కప్, 7వ పారా ఆర్మ్ రెజ్లింగ్ కప్‌లో 75 కేజీల ప్లస్‌లో లెఫ్ట్‌హ్యాండ్ విభాగంలో బంగారు బహుమతి సాధించగా రైట్‌హ్యాండ్ విభాగంలో రజతపతకం సాధించారు. ఈ పోటీలలో తాలూకాలోని హందేనహళ్ళి సంతోష్ హెచ్ రామకృష్ణ, ఆనేకల్ భాగ్యమ్మలు కూడా పాల్గొన్నారు. రెజ్లింగ్‌లో రాణించిన క్రీడాకారులకు తాలూకా వాసులు ఆత్మీయంగా స్వాగతించారు. కోచ్‌లు దీపక్‌సింగ్, శ్రీనివాస్, మధురల నేతృత్వంలో పోటీల్లో పాల్గొన్నామని వారికి వందనా లంటూ క్రీడాకారులు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న సమాజసేవకుడు ఆంజినప్ప

శిడ్లఘట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కొత్తనూరు గ్రామపంచాయతీ పరిధిలోని గూరమడుగు గ్రామంలో నిర్మిస్తున్న గంగాభవాని ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్‌కు చెందిన సమాజ సేవకుడు పుట్టు ఆంజినప్ప రూ.2లక్షల విరాళం అందచేశారు. నిర్మాణదశలోని ఆలయానికి చేరుకున్న ఆంజినప్పకు స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం రూ.2 లక్షల చెక్కును ఆలయ ట్రస్టుకు అందచేశారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలతో ఇల్లు కోల్పోయి ఇబ్బందులో ఉన్న వెంకటమ్మ అనే వృద్ధురాలిని పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందచేసి ధైర్యం నింపారు. గ్రామంలోని మణి, నవీన్ యువకులు అవయవ వైఫ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయహస్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంజినప్ప మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో రైతులు ద్రాక్షను ప్రముఖ పంటగా పండిస్తున్నారన్నారు. శిడ్లఘట్ట తాలూకా గూరమడుగు గ్రామంలో కూడా ద్రాక్షను పంటపై ఆధారపడినవారు అధికంగా ఉన్నారన్నారు. ఇలాంటి శ్రమజీవులకు తమవంతు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. రైతులు, శ్రామికవర్గాల జీవితాల్లో వెలుగులు రావాలన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న గ్రామస్థుల నిర్ణయం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా తుమ్మనహళ్ళి వెంకటేశ్, శీగహళ్ళి బసవరాజ్, హుజుగూరు బచ్చేగౌడ, ఆలయ ట్రస్టు పదాధికారులు తదితరులు ఉన్నారు.

దర్గా భూమిని కాపాడండి



ధర్నా నిర్వహిస్తున్న వక్ఫ్ ఆస్తుల రక్షణ సమితి నాయకులు

రాయచూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కరీముల్లాషా ఖాద్రి దర్గాకు చెందిన భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ ఆస్తుల రక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ భూమి ఆక్రమణను నిరసిస్తూ సోమవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 1965లో సర్వే నెంబర్ 1179/1లో 28 ఎకరాల 30 గుంటల భూమిని వక్ఫ్ ఆస్తిగా గుర్తించారని, అందులో ఎలాంటి క్రయవిక్రయాలు జరగడంపై నిషేధం ఉంటుందన్నారు. అనంతరం కొంతమంది భూమి తమకే చెందుతుందని, ఇటీవల కబ్జా చేసుకుని దానిని ప్లాట్‌లుగా విభజించి విక్రయిస్తున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,608.83
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,592	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,432	8,906
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	35.33

కేఎంఎఫ్‌కు దీపావళి బిగ్ ఆర్డర్స్



ఆటోలో తరలుతున్న మైసూరు పాకు

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ సంస్థ తయారు చేసే స్వీట్స్‌కు దపావళి పండుగ సందర్భంగా పెద్దమొత్తంలో ఆర్డర్లు వచ్చాయి. తిరుపతి లడ్డూను కల్తీ నెయ్యితో తయారీ అనే అంశంతో మేలు రకమైన నెయ్యి తయారు చేసే నంది ప్రొడక్ట్స్‌కు డిమాండ్ పెరిగింది. జిందాల్ సంస్థ ఏకంగా రూ. 1.5 కోట్లు విలువ చేసే మైసూరు పాకును ఆర్డర్ చేయగా, సుకో బ్యాంకు రూ.కోటి విలువ చేసే మైసూరు పాకు కేఎంఎఫ్ ప్రొడాక్టుకు ఆర్డర్ ఇచ్చింది. ఇంత పెద్ద ఆర్డర్ రావడం ఇదే తొలిసారి అని ఆ సంస్థ అధికారులు తెలిపారు.

కోలివుడ్‌లో మొదటిస్థానంలో ఉంటా

● ఎగ్జిబిటర్స్ సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి



బళ్లారి సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కన్నడ చిత్రపరిశ్రమలో నేనెప్పుడు మొదటి స్థానంలో ఉంటానని బళ్లారి, విజయనగర జిల్లాల సినిమా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పుష-2 సినిమా డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో కేజీఎఫ్ కంటే ఎక్కువ థియేటర్లలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, ఆయన వెల్లడించారు. సోమవారం నగరంలోని నటరాజ్ సినిమా థియేటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అల్లుఅర్జున్ నటించిన పుష్ప-2 డిసెంబర్ 5న విడుదల కానుందని, కర్ణాటకలో ప్రదర్శించే హక్కు ఎన్ సినిమాస్‌కు వచ్చిందన్నారు. అవకాశం ఇస్తే కేజీఎఫ్ సినిమాల కంటే ఎక్కువ థియేటర్లలో విడుదల చేస్తానన్నారు. హైదరాబాద్‌లో మాట్లాడిన విషయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపార్థం చేసుకోవద్దని కన్నడ అభిమానులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

భూకబ్జాలపై అధికారుల సర్వే

సిరుగుప్ప, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కబ్జా చేసిన భూములపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాలుకాలోని టెక్కలకోట పట్టణం సరిహద్దు ప్రాంతం హోసళ్లి గ్రామం వద్ద రెవెన్యూ అధికారి శివరాజు, సర్వేయర్ మల్లికార్జున కబ్జాకు గురైన భూములను సర్వే చేశారు. భూములు కబ్జా జరిగి వుంటే నివేదికను ప్రభుత్వానికి అందజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రైతు సర్వేకు సహకరించాలని కోరారు. రైతు సంఘం నాయకులు నరేంద్ర సింహ, పరమేష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బన్నిజిగ సమాజం అన్ని రంగాల్లో ముందుండాలి

కంప్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బన్నిజిగ సమాజం అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరి విరుపాక్షప్ప అన్నారు. ఆదివారం పట్టణంలో వీరశైవ కళ్యాణమండపంలో బన్నిజిగ సమాజం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బన్నిజిగ సమాజం మొదటి నుంచి బసవన్న తత్వాలను అలవరుచుకుని జీవితంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రముఖులకు బన్నిజిగసిరి అవార్డులు అందించి సన్మానించారు. ఉపాధ్యాయులు కోరి సన్న శరణప్ప, శివానంద, మహిళా అధ్యక్షురాలు చైత్ర, సిద్దాపుర, కురుగేంద్ర, చెన్నస్వామి, చెన్నప్ప, లింగనగౌడ, దొడ్డ బసవరాజు, మల్లికార్జున, కల్లుడి శరణప్ప, జగదీష్, సుభాష్, మహిళలు పాల్గొన్నారు.



బన్నిజిగ సమాజ ప్రముఖులను సన్మానించిన దృశ్యం

ఆకట్టుకుంటున్న కలబురిగి గజ ఫిరంగి!

● వరల్డ్ రికార్డ్స్‌లో చేర్చాలని పరిశోధకుల డిమాండ్

● యుద్ధాల్లో ఫిరంగులను ఉపయోగించిన ఘనత బహమని సుల్తానులదే



కలబురిగి కోట ప్రధాన ద్వారం...

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మధ్య యుగం నాటి భారత దేశ చరిత్రలో యుద్ధాలు అంటేనే మొదట మనకు కనిపించేది ఫిరంగులే. అంటే ఆ కాలంలో పెద్ద పెద్ద ఫిరంగులు ఉండడం సుల్తాన్‌లు ప్రతిష్ఠగా భావించేవారు. కర్ణాటక రాష్ట్రంతో పాటు దేశంలో సుల్తాన్‌లు పాలించిన రాష్ట్రాలతో పోలిస్తే గుల్బర్గా(కలుబురిగి) కోటలో దేశంలో మరెక్కడా లేని ఫిరంగులు ఇక్కడ చూడవచ్చు. ఇలాంటి బృహత్ ఫిరంగులను వరల్డ్ రికార్డ్స్‌లో చేర్చాలన్నది స్థానిక చారిత్రకారుల ప్రధాన డిమాండ్. బహమని సుల్తానుల పాలనాలో ప్రస్తుత కలబురగి కోటలో శత్రువులను తుదిముట్టించేందుకు ఉపయోగంచిన ఫిరంగులు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. మధ్యకాల చరిత్రలో దేశంలో మొదటిసారిగా ఫిరంగులను ఉపయోగించిన ఖ్యాతి బహమని సుల్తానులకు దక్కుతుంది. ఇక్కడ బృహత్ ఫిరంగులను స్థాపించడం విశేషం. చారిత్రక పరిశోధకుల ప్రకారం ప్రపంచంలో ఇదే అతిపెద్ద ఫిరంగిగా చెప్పుకుంటారు. ఇప్పటి వరకు కలుబురిగి కోటలో ఉన్న ఫిరంగి స్థాయిలో ఎక్కడా లేవని చరిత్రకారులు చెబుతున్నారు. దీనిని గిన్నిస్ బుక్కులో చేర్చాలని ప్రముఖ చారిత్రక పరిశోధకులు డిమాండ్ చేశారు. దేశంలో మొదటిసారిగా యుద్ధాల్లో ప్రత్యర్థులను తిప్పికొట్టడానికి బహమని సుల్తానులు ఇలాంటి ఫిరంగులను ఉపయోగించినట్లు చరిత్ర చెబుతోంది. 1365 విజయనగర సామ్రాజ్యం దో అబ్ కాళగ యుద్ధం నడుస్తున్న సమయంలో బహమని సుల్తాన్ మొదటి మహ్మద్ షా ఫిరంగులను ఉపయోగించినట్లు చరిత్రపుటల్లో ఉన్నాయి. కలబురిగి కోట రక్షణ కోసం 26 ఫిరంగులను ఏర్పాటు చేసినట్లు ఇప్పటికీ ఆ కోటలో ఆధారాలు ఉన్నాయి. అందులో ప్రత్యేకంగా బారహ గజ ఫిరంగి ఒకటి. 14వ శతాబ్దంలో బారహ గజ ఫిరంగి పంచలోహాలతో తయారు చేశారు. ఒక గజం అంటే అందాజుగా మూడు అడుగులు. ప్రస్తుతం గజ ఫిరంగి 29 అడుగుల పొడవు, 7.6 అడుగుల చుట్టుకొలత, 2 అడుగుల వ్యాసం ఉంది. 7 అంగులాలు అర అడుగు కంటే ఎక్కువ మందం కలిగి ఉంది. సుమారు 75 టన్నుల వరకు ఈ గజ ఫిరంగి ఉన్నట్లు సమాచారం. ఈ ఫిరంగి నుంచి సుమారు ఒక కిలోమీటరు వరకు మందుగుండు శత్రువులపైకి వెళ్ళేలా తాయారు చేశారు. కలబుర్గి కోటలో 26 ఫిరంగులు ఉన్నాయి. అయితే చూసేందుకు మాత్రం 17 కనిపిస్తాయి. కొన్ని ముళ్ళకంపల మధ్య మునుకుపోయాయి. యుద్ధంలో మొనుకుని పోయే ఫిరంగులు వేరు. కోట రక్షణ కోసం స్థిరంగా ఏర్పాటు చేసిన ఫిరంగులు వేరు. ఇవి 4 అడుగుల నుంచి 29 అడుగుల పొడవుగల ఫిరంగులను ప్రస్తుతం కలబురిగి కోటలో పర్యాటకులు చూసేందుకు వీలు ఉంది.



పర్యాటకులను ఆకర్షిస్తున్న గజ ఫిరంగి

ఘనంగా కేఆర్ నారాయణన్ జయంతి



కేఆర్.నారాయణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రవిచెళ్లగుర్కి , ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, అక్టోబరు 28: తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మాజీ రాష్ట్రపతి కే.ఆర్.నారాయణన్ 105వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటక టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళగుర్కి కేఆర్ నారాయణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ కన్నడ సబ్జెక్ట్ టీచర్ శ్వేత, ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి, ఉమ్మెహాని, శశమ్మ, గురుప్రసాద్, విజయ ముంద్రగి, సుమా పాల్గొన్నారు.

రీబోక్ సంస్థ డైరెక్టర్‌గా నాగరాజు గౌడ

కంప్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవలాపురం గ్రామానికి చెందిన గౌడ్ర నాగరాజు రీబోక్ సంస్థకు నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయనను పలువురు అభినందించి సన్మానించారు. కంప్లి తాలుకా నుంచి రీబోక్ సంస్థకు డైరెక్టర్ కావడంతో సహకార సంఘ నేతలు, ఏపీఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అభినందనలు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం రాయచూరు శాఖ ద్వారా మెంబర్‌గా ఎన్నుకోవడం ఆనందంగా వుందన్నారు. మున్ముందు రైతులకు సహకార సంఘాలకు ఈ సంస్థ ద్వారా న్యాయం చేకూర్చుతామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంసీ అధ్యక్షులు అంజనప్ప, మరేగౌడ, ప్రసాదరావు, బసవరాజు, నాగరాజు పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరెక్టర్ల నియామకం



నియామక పత్రాలు అందుకుంటున్న హనుమంతప్ప, ఉలిగప్ప

కంప్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి నూతనంగా హనుమంతు, హెచ్ ఉలిగప్ప డైరెక్టర్లుగా నియమితులయ్యారు. కంప్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ నియామకం జరిగింది. మొత్తం 23 మంది ఓటర్లు వుండగా 22 మంది సభ్యులుగా చేర్చుకున్నారు. మెట్రి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉలిగప్ప 17 ఓట్లతో విజయం సాధించారు. రామసాగరం, సుగ్గినల్లి పీడీవోగా ఉన్న హనుమంతప్ప 13 ఓట్లతో నియామకమయ్యారు. ఒక్కఓటుతో పీడీవో బీరలింగ ఓడిపోయారని ఎన్నికల అధికారి పక్కీరప్ప తెలిపారు. చంద్రయ్య సొప్ప మఠ, రేణుకారాధ్య వారికి ప్రమాణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో విరూపాక్షి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఖాతాదారులతోనే సహకార సంఘం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేఎన్ గణేశ్

కంప్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని పత్తిన సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే రైతులు, ఖాతాదారుల వల్లే సాధ్యమని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అన్నారు. మెట్రి గ్రామంలో నూతనంగా కృషి పత్తిన సహకార సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సహకార సంఘం కట్టడానికి తమ వంతు సహకరిస్తామన్నారు. ప్రతి ఒక్క సభ్యుడు సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వారితో పాటు కార్యదర్శి మహర్షి, అధ్యక్షులు హోసేకోటి జగదీష్, ఉపాధ్యక్షులు గంగాధర, సభ్యులు, ప్రముఖులు రాజా, గ్రామ పంచాయతీ అధ్యక్షులు గుండమ్మ, మూకయ్య స్వామి, శ్రీనివాసరావు, కరిబసనగౌడ, నారాయణప్ప, జడియప్ప, కుమారస్వామి పాల్గొన్నారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: లోకాయుక్త ఎస్పీ

బళ్లారి సిటీ, అక్టోబరు 28: ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఏ అధికారి, సిబ్బంది అయినా లంచం డిమాండ్ చేస్తే వారు లోకాయుక్త కార్యాలయంలో ఫిర్యాదుచేయవచ్చని కర్ణాటక లోకాయుక్త బళ్లారి డివిజన్ పోలీస్ సూపరింటెండెంట్ సిద్దరాజు తెలిపారు. బళ్లారి లోకాయుక్త డివిజన్ కార్యాలయం, బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, కిష్కింద యూనివర్శిటీ ఆధ్వర్యంలో సోమవారం బీఐటీఎం కళాశాల హాల్లో ఏర్పాటు చేసిన అవినీతి వ్యతిరేక అవగాహన వారోత్సవాలు 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాపనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు అందజేసే దరఖాస్తులకు అధికారులు లంచకోసం జాప్యంచేస్తే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రభుత్వ కార్యాలయాన్ని ఉపయోగించుకుని అక్రమ ఆస్తులు సంపాదించినా కార్యాలయాన్ని దుర్వినియోగం చేసే వ్యాపారం చేస్తున్నట్లు తెలితే 9364063511, 9364062630 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కర్ణాటక లోకాయుక్త బళ్లారి డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్‌పోలీస్ వసంత్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణం చేస్తున్న అధికారులు

అనంతరం అవినీతి నిరోధంపై పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీ, సంగమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ యడవళ్ళి బసవరాజ్, వీసీ పాటిల్, చైతన్య రెడ్డి, బీఐటీఎం రాష్ట్ర సేవా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి షేక్మీర్, గురురాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సండూరు ఉప సమరం

సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయండి

● డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సండు ఉప ఎన్నికల్లో ఏ రాజకీయ నాయకుడు, కార్యకర్త ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్నికల దుష్ప్రవర్తలను నివారించేందుకు భారత ఎన్నికల కమిషన్ సి-విజిల్ మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసిందన్నారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్‌ఫోన్ ఉండడం సర్వసాధారణమని, సి-విజిల్‌తో మీరు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను మీ స్మార్ట్‌ఫోన్ నుంచి నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేయడం ఎలా?

ముందుగా గూగుల్ ప్లేస్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ నుంచి సి-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీరు చూసిన ఏదైనా ఎన్నికల సంబంధిత ఉల్లంఘనల ఫొటో లేదా వీడియోలను క్యాప్చర్ చేయాలని, సంఘటనస్థాన వివరాలను అందించడం ద్వారా యాప్ లో మీ నివేదికను అప్‌లోడ్ చేయాలి. చర్యలకోసం నివేదిక అందిన వెంటనే సంబంధిత అధికారులకు ఫార్వార్డ్ చేస్తారు. యాప్ ఓపెన్ చేయగానే మీ పేరు, మొబైల్ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి. డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తున్న అభ్యర్థులు వారి మద్దతుదారుల ఫొటో లేదా వీడియో(రెండు నిముషాలు) పబ్లిక్ క్యాప్చర్ చేయవచ్చు. ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అక్కడ చిరునామాను నమోదు చేయాలి. ఇది పూర్తిగా ఉచితం. ఒక వ్యక్తి పలానా వ్యక్తికి లేదా పార్టీకి డబ్బు పంచడం, దుస్తులు, మద్యం పంపిణీ, పోలింగ్ స్టేషన్‌కు 200మీటర్ల దూరంలో ప్రచారం చేయడం నిషేధం. పోలింగ్ రోజున ఓటర్లను రవాణా చేయడం తదితరాలవి ఏదైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలను కనుగొంటే ఈయాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

సీ-విజిల్ టీమ్ యాక్టివ్

బళ్లారి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సి-విజిల్ బృందం ఇప్పటికే పనిచేస్తోంది. సండూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సి-విజిల్ ద్వారా మొత్తం 16 ఫిర్యాదులు నమోదు కాగా 13 కేసులు పరిష్కరించారు. ఓటర్లు అవసరమైన సమాచారం, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని 24 గంటలు కంట్రోల్ రూమ్ లేదా ఓటరు హెల్ప్ లైన్ నంబర్ 1950కి కాల్ చేసి సమాచారాన్ని పొందవచ్చు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

కంప్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దరోజీ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సభ్యులు సోమవారం గాలి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. గాలి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో విసుగుచెంది బీజేపీలోకి చేరుతున్నారని తెలిపారు. సండూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికలలో బంగారు హనుమంతప్పకు ఇప్పటికే జోరుగా ప్రచారం చేపడుతున్నాం. గ్రామాలలో స్పందన కూడా లభిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలే ఓట్లతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెబుతారన్నారు. వారితో పాటు అనిల్ నాయుడు, దివాకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరలేదు

● బైరతి బసవరాజ్



మాట్లాడుతున్న బైరతి బసవరాజు, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ముందు బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని బైరతి బసవరాజ్ విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ బీజేపీ ఎమ్మెల్యేలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖండించారు. సండూరు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత గెలుపునకు బసవరాజ్ సోమవారం ప్రచారంలో పాల్గొని సండూరు వద్ద విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమీ పనిచేయడం లేదని విమర్శించాడు. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎస్ఐ



బేవనహళ్లి వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

బళ్లారిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని గుంతకల్లు-బళ్లారి ప్రధాన రహదారిలో బేవనహళ్లి వద్ద జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్లకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎందరో ప్రమాదాలు గురవుతూ కాళ్లు చేతులు విరిగి ఆస్పత్రిపాలవుతున్నారు. దీనిపై స్పందించిన ఎస్ఐ శశిధర్ ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ వారికి సూచించడంతో కన్‌స్ట్రక్షన్స్ అధికారులు తక్షణం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్థులు ఎస్ఐను అభినందించారు.



కాంట్రాక్టర్ ద్వారా గుంతలకు మరమ్మతు చేయించిన ఎస్ఐ శశిధర్

హోసూరు జోన్

663 మ్యాథ్స్ ఫార్ములాలతో... నవంబరు 6న ప్రపంచ రికార్డుకు కసరత్తు

హోసూరు అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన శ్రీచైతన్య టెక్నో గ్రూప్ స్కూల్ విద్యార్థులు మరో సరికొత్త ప్రపంచరికార్డుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక పాఠశాల డైరెక్టర్ సీమా బోపణ్ణ తెలిపారు. ఇందుకు విద్యార్థులకు తర్ఫీదును ముమ్మరం చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 20 రాష్ట్రాల్లో శ్రీచైతన్య టెక్నో గ్రూప్ కు చెందిన సుమారు 10వేలమంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కిండర్ గార్డెన్ నుంచి ఐదో తరగతి వరకు 2018లో 100 దేశాల పేర్లు, వాటి రాజధానులను గుర్తించడం, ఇది ప్రతి సంవత్సరం తన జ్ఞానాన్ని జ్ఞాపకశక్తిని రెట్టింపు చేసుకుంటున్నారన్నారు. 2022లో ఆవర్తన పట్టికలో 118 రసాయన మూలకాలు వరుసగా పరమాణు సంఖ్యలకు జోడించబడతాయి. 2023లో 100నిమిషాల్లో 100 మ్యాథమెటికల్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ట్రిపుల్‌వరల్డ్ రికార్డు సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం నవంబర్ 6న 663 మ్యాథమ్యాటికల్ ఫార్ములాలతో అతిపెద్ద ప్రపంచ రికార్డుకు కృషి చేస్తున్నామన్నారు. హోసూరు శాఖల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొనబోతున్నట్లు తెలిపారు. పోటీల ద్వారా గణితం సబ్జెక్టు పట్ల ఉన్న భయాన్ని తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సోమవారం ఏర్పాటైన సమావేశంలో ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్, పుష్పవల్లి, తమిళనాడు జనరల్ మేనేజర్ హరిబాబు, పాఠశాల డిప్యూటీ ప్రిన్సిపాల్ రాజేశ్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ వనజాక్షి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు

గ్రీవెన్స్‌లో 324 అర్జీలు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వంలో పీపుల్స్ గ్రీవెన్స్ డే రిడ్రెసల్ డే సమావేశంలో ప్రజలనుంచి 324 అర్జీలు వచ్చాయి. ప్రధానంగా ఇళ్లు, ఉచిత కుట్టుమిషన్‌లు, వృద్ధాప్య పింఛన్, మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్లపై వినతులు సమర్పించారు. అర్హులైన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సాధ్యం కానివాటికి అర్జీదారులకు వివరించాలన్నారు. తొలుత కలెక్టర్ నేతృతంలో అవినీతి నియంత్ర వారోత్సవంపై ప్రతిజ్ఞ చేశారు. అక్టోబరు 28 నుంచి నవంబరు 3 వరకు వారోత్సవం ఉంటుందన్నారు. ఆర్థిక, రాజకీయ, సామజిక ప్రగతికి అవినీతి అంశం ప్రధానఅడ్డంకిగా మారిందన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు, ప్రైవేట్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సరయు

సంస్థలు కలిసి పనిచేయాలని అభిలషించారు. దేశంల్లోని ప్రతి పౌరుడు ఎల్లప్పడు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని, నిజాయితీతో గౌరవంగా జీవించాలన్నారు. ఈమేరకు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురణ్, జిల్లా కలెక్టర్ ఇంటర్యూ అసిస్టెంట్ పుష్ప, జిల్లా కలెక్టర్ ఇంటర్యూ అసిస్టెంట్ సుందరరాజ్, జిల్లా ఆదిద్రావిడ సంక్షేమ అధికారి రమేశ్‌కుమార్ ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్‌కు సీల్

హోసూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా హోసూరు ప్రాంతంలో పలు చోట్ల బాణాసంచా విక్రయిస్తున్నారు. కాగా కొందరు యజమానులు అక్రంగా నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. హోసూరు నల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఎలసగిరి ప్రాంతంలో ఒక గోడౌన్ లో భారీ ప్రమాణంలో బాణాసంచా ఉందనే సమాచారం అందింది. హోసూరు ఏఎస్పీ అక్షయ్ అనీల్‌వాకర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లో 1500 కిలోల బాణసంచా నిల్వ చేసేందుకు అనుమతి పొంది 33 వేలకిలోల బాణసంచా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు బాణాసంచాను స్వాధీనం చేసుకుని గోడౌన్‌కు తాళం వేశారు.

ట్రక్ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్.. మందలించిన పీసీ

హోసూరు(క్రైం) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హోసూరు సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూజూవాడి ప్రాంతంలో ఒక ట్రక్ హోసూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ ట్రక్ డ్రైవర్‌కు బుద్ధి చెప్పి మందలించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఆదివారం రాత్రి ఒక ట్రక్ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్ చేసి ఇతరులను ఇబ్బంది కలిగించినట్లు తెలుస్తోంది. దీంతో సదరు ట్రక్ డ్రైవర్‌ను డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మందలించాడు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



డ్రైవర్‌ను మందలిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్